క్లుప్తంగా

సామాజిక సేవలో యువత భాగస్వామ్యం కావాలి



ఉయ్యూరు: సామాజిక సేవలో యువత భాగస్వామ్యం కావాలని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి పిలుపునిచ్చారు. ఉయ్యూరు పట్టణంలో చిన్నిదేవి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేసవి చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి, ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. చక్రవర్తి మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటుచేయటం అభినందనీయమన్నారు. యువత ప్రజా సేవలో భాగస్వామ్యమై సామాజిక బాధ్యత పాటించాలని కోరారు. పార్టీ ఉయ్యూరు పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం, మున్సిపల్ వైస్ చైర్మన్ సోలే సురేష్ బాబు, కో ఆప్షన్ సభ్యుడు షేక్ ఖలీల్, పార్టీ నాయకులు జంపాన కొండలరావు, అబ్దుల్ సద్దాం, గడ్డం చైతన్య, సలీంబేగ్, అహ్మద్‌ఖాన్, ఎండీ అక్బర్‌బాషా, పినమాల నాగకుమార్, ఉయ్యూరు సుధాకర్ పాల్గొన్నారు.

ఎంకే బాబుకు స్ఫూర్తి అవార్డు అందజేత



ఉయ్యూరు: విద్యా, సామాజిక సేవా రంగాల్లో విశేష సేవలకు ఎంకే బాబు విద్యాసంస్థల డైరెక్టర్ ఎంకే బాబుకు చుక్కా రామయ్య స్మారక స్ఫూర్తి అవార్డు లభించింది. హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఆదివారం చుక్కా రామయ్య స్మారక స్ఫూర్తి అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఉయ్యూరు పరిసర గ్రామాల్లో విద్యాభివృద్ధి, సామాజిక సేవా రంగాల్లో విశేష సేవలు అందిస్తూ పేదల అభ్యున్నతికి పాటుపడుతున్న ఎంకే బాబుకు ఈ అవార్డు దక్కింది.

మహిళా అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం



ఆటోనగర్(విజయవాడతూర్పు): మహిళలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని శ్రీ పరంజ్యోతి కల్కి భగవద్ దాసాజీ ప్రబోధించారు. ఆటోనగర్‌లోని ఏటీపీ హాలులో ఆదివారం ఎనిమిది గంటల జ్ఞాన తరగతులను జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ భగవాన్ ప్రభోదించిన స్త్రీ సాధికారతను వివరించారు. శ్రీ పరంజ్యోతి అనుగ్రహంతో స్త్రీ చైతన్యంలో ప్రశాంత స్థితిని, ప్రేమస్థితి, ఆనంద స్థితిని, కరుణస్థితిని నింపే క్రమంలోనే ఇటువంటి శిక్షణ తరగతులు దోహదపడుతాయన్నారు. గద్దె అనురాధ మాట్లాడుతూ ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు మహిళ శ్రేయస్సుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో వెయ్యి మందికి పైగా మహిళలు పాల్గొన్నారు.

మధురంగా సాగిన సంగీత కచేరీ



విజయవాడకల్చరల్: స్వరతరంగిణి ఆధ్వర్యంలో నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం దుర్గాపురంలోని శివరామకృష్ణక్షేత్రంలో యువ సంగీత కళాకారిణి సోమయాజుల విష్ణుప్రియ ఇందిర నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి మధురంగా సాగింది. సంగీత త్రిమూర్తులు త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, వాగ్గేయకారులు అన్నమయ్య, రామదాసు కీర్తనలు ఆలపించారు. చెన్నైకి కుందుర్తి అరవింద్, అంబటిపూటి కామాక్షి వాద్య సహకారం అందించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంగీత విద్వాంసుడు గందూరి శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ యువ గాయనీ గాయకులను ప్రోత్సహించాల్సిన అవసరముందని పేర్కొన్నారు.

కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): టిఫిన్ తీసుకొచ్చేందుకు కొండ దిగిన తన కుమార్తె కనిపించకుండా పోయిందని తల్లి ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. కలరా హాస్పటల్ కొండ ప్రాంతంలోని జొన్నలగడ్డ మస్తాన్ వీధిలో తమ్మిశెట్టి సుమలత, వీరన్న దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు సంతానం కాగా కుమార్తె భవానీకి వివాహం చేశారు. అల్లుడికి కిడ్నీ సమస్య రావడంతో వారం రోజుల కిందట భవానీ, భర్తను తీసుకుని పుట్టింటికి వచ్చింది. 16వ తేదీ ఉదయం భర్తకు టిఫిన్ తీసుకొస్తానని చెప్పి కొండ దిగిన భవానీ సాయంత్రం అయినా తిరిగి రాలేదు. దీంతో బంధువులను ఆరా తీసినా ప్రయోజనం లేక పోవడంతో తల్లి సుమలత పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కాలువలకు మోక్షం కలిగేనా!

- తూడు, గుర్రపుడెక్కతో నిండిన కాలువలు
- వేసవి వచ్చినా తూడు తొలగింపు పనులు చేపట్టని వైనం
- ఖరీఫ్‌కు సాగునీరు ప్రశ్నార్థకమే!



కంకిపాడు లాకుల వద్ద పేరుకుపోయిన గుర్రపుడెక్క, వ్యర్థాలు

కంకిపాడు: వేసవి వచ్చినా సాగునీటి కాలువలకు మోక్షం కలగడం లేదు. ఏ కాలువ చూసినా గుర్రపుడెక్క, తూడుతో నిండిపోయి ఉన్నాయి. ఆధునికీకరణ నిధులు విడుదలలో జరుగుతున్న జాప్యంతో తూడు తొలగింపు పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. కాలువలు ఇలా ఉంటే ఖరీఫ్ సీజన్‌లో కాలువ చివరి భూములకు సాగునీరు అందే పరిస్థితి ఉండబోదని అన్నదాతలు వాపోతున్నారు.

ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదలయ్యే సాగునీరు కంకిపాడు సెక్షన్ లాకుల మీదుగా దిగువకు ప్రవహిస్తుంది. సెక్షన్ పరిధి పెనమలూరు మండలం యనమలకుదురు నుంచి పమిడిముక్కల సమీపంలోని ఫత్తేలంక వరకూ ఉంది. ప్రధానంగా బందరు, పుల్లేరు, వల్లూరు పడమట కాలువలు ఉన్నాయి. వీటికి అనుబంధంగా అనేక ప్రధాన పంట కాలువలు ప్రవహిస్తున్నాయి. 35 వేల ఎకరాల భూమి సాగు జరుగుతుంది. ప్రధానంగా వరి, చెరకు, పసుపు, కూరగాయలు, తమలపాకు, మొక్కజొన్న ఇతర వాణిజ్య పంటలు సాగు అవుతుంటాయి.

ఎటు చూసినా తూడు, గుర్రపుడెక్కే..

ప్రధాన కాలువలతో పాటు అనుబంధంగా ఉన్న ఏ పంట కాలువను చూసినా నిండుగా గుర్రపుడెక్క, తూడుతో కనిపిస్తున్నాయి. అడపా దడపా రసాయన మందులు పిచికారీ జరిగిందే తప్ప పూర్తి స్థాయిలో తూడు, గుర్రపుడెక్క తొలగింపులు దశాబ్దకాలంపైగా లేవు. దీంతో తూడు సమస్య జటిలంగా మారింది. ఈ వేసవిలో తూడు, గుర్రపుడెక్కను పూర్తి స్థాయిలో తొలగించటంతో పాటు ప్రధాన కాలువల పూడికతీతలు కూడా చేపట్టాల్సి ఉంది. అప్పుడే సాగునీటి వ్యవస్థ మెరుగ్గా ఉంటుందని రైతులు చెబుతున్నారు.



గోసాల వైపు బందరు కాలువలో..



చిట్టడవిని తలపిస్తున్న నంబిగుంట కాలువ

ప్రతిపాదనలు పంపాం..

కాలువల ఆధునికీకరణ, గుర్రపుడెక్క తొలగింపు, ఇతర అభివృద్ధి పనులకు ఇప్పటికే క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపాం. నెలాఖరుకు ఆమోదం వచ్చి నిధులు విడుదల అవుతాయని భావిస్తున్నాం. కేటాయింపులు జరగ్గానే పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

– నాగబాబు, ఏఈ, ఇరిగేషన్ సెక్షన్, కంకిపాడు

వేసవిలో అవ్వకపోతే సాగునీరు ప్రశ్నార్థకం..

అప్పుడే ఏప్రిల్ ఆఖరు వస్తోంది. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేసి నివేదికలను ప్రభుత్వానికి పంపారు. కానీ నేటికీ అవసరమైన నిధులు కేటాయింపులు జరగలేదు. శాఖాపరమైన ఆమోదం, టెండర్ల ప్రక్రియ పూర్తయ్యేసరికి మరింత జాప్యం అయ్యే ప్రమాదం ఉంది. వేసవి సీజన్ దాటక ముందే పనులు సాగాలి. అప్పుడే కాలువ చివరి భూములకు సైతం సాగునీరు సమృద్ధిగా చేరుతుంది. లేనిపక్షంలో సాగునీరు అందక సాగు ప్రశ్నార్థకంగా మారుతుందని రైతులు వాపోతున్నారు. అంతేకాకుండా తూడు, గుర్రపుడెక్క కారణంగా పరిమితికి మించి కాలువలకు నీటిని విడుదల చేయటంతో కట్టలు బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో గండ్లు పడటం, సాగునీరు వృథా కావటం వంటి ఘటనలు లేకపోలేదు. పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తించి సాగునీటి వ్యవస్థపై ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

ఏజీపీగా ఎస్‌జీటీ నీరజ



గన్నవరం: గన్నవరం, ఉయ్యూరు కోర్టుల్లో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ)గా గన్నవరానికి చెందిన సీనియర్ న్యాయవాది ఎస్‌జీటీ నీరజ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను అందుకున్నట్లు ఆదివారం ఆమె తెలిపారు. న్యాయవాది వృత్తిలో 32 ఏళ్ల అనుభవం కలిగిన నీరజ గతంలో 2012–15 మధ్య సహాయ ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేశారు. తిరిగి రెండో సారి ఆమెకు ఏజీపీగా అవకాశం దక్కింది. మూడేళ్ల పాటు ఆమె ఈ పదవిలో కొనసాగనున్నారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తూ ప్రజలకు న్యాయపరమైన సేవలందిస్తానని నీరజ తెలిపారు. తనను ఏజీపీగా ప్రతిపాదించిన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, ఇతర ప్రభుత్వ పెద్దలకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. ఏజీపీగా నియమితులైన ఆమెను పలువురు న్యాయవాదులు అభినందించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): క్షణికావేశంతో గొడవలకు పాల్పడటం, అల్లర్లు చేయడం వల్ల జీవితాలు అంధకారంగా మారతాయని అజిత్‌సింగ్ నగర్ సీఐ బీహెచ్ వెంకటేశ్వర్లు సూచించారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, పాతనేరస్తులకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మానవ జీవితం ఎంతో అందమైనదని.. కానీ కొంతమంది యువత చెడు వ్యసనాలు, స్నేహాల వల్ల ఆ జీవితాన్ని అంధకారంగా మార్చుకుంటున్నారన్నారు. సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలి తప్ప లేనిపోని గొడవలకు వెళ్లడం మంచి పద్ధతి కాదన్నారు. పాత నేరస్తులు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని.. లేకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టేషన్ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ పర్వదిన ప్రార్థనలు

కేసరపల్లి(గన్నవరం): గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లోని క్రైస్తవ దేవాలయాల్లో ఆదివారం ఈస్టర్ పర్వదినే ప్రార్థనలను క్రీస్తు విశ్వాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కేసరపల్లిలోని పునీత అంతోని వారి దేవాలయంలో ఏసుక్రీస్తు ఉత్థాన పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం విచారణ కర్తలు రెవ. ఫాదర్ నూతలపాటి కిశోర్ నేతృత్వంలో దివ్యబలిపూజ సమర్పించారు. క్రీస్తు ఉత్థాన సూచికగా భక్తులు పాస్కా క్యాండిల్స్ వెలిగించి భక్తిగీతాలను ఆలపించారు. సంఘ పెద్దలు, మరియమాత దళ సభ్యులు, పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు. గన్నవరంలోని ఆర్‌సీఎం బాలయేసు దేవాలయంలో విచారణ కర్తలు ఫాదర పసల థామస్ నేతృత్వంలో ఈస్టర్ ప్రార్థనలు జరిపారు. స్థానిక సీఎస్ఐ టౌన్ చర్చిలో తెల్లవారుజామున ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అదే విధంగా కొండపావులూరు, ముస్తాబాద, అజ్జంపూడి విచారణల పరిధిలో ఈస్టర్ పండుగను ఘనంగా జరుపుకున్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ పండుగ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్‌లో ఈస్టర్ పర్వదినాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక జ్యోతినగర్ ఆర్సీఎం చర్చి, సీఎస్ఐ టౌన్ చర్చి, పరిశుద్ధ సీయోను సీఎస్ఐ చర్చి, హోసన్నా మందిర్, కారుణ్య ప్రార్థనా మందిరం, బేతేలు చర్చి, ఎల్ఎఫ్ఎల్ చర్చిల్లో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో క్రైస్తవులు హాజరై ప్రార్థనలు చేశారు. జ్యోతినగర్ విచారణకర్త ఫాదర్ చేబ్రోలు జోసఫ్ తంబి ఆధ్వర్యంలో దివ్య బలిపూజ నిర్వహించి, భక్తులకు ప్రత్యేక సందేశాన్ని అందించారు. సకల మానవాళి పాప పరిహారానికై ఏసుక్రీస్తు శిలువలో ప్రాణాలు విడిచి, ఆ తర్వాత మూడో రోజున సమాధి నుంచి పునరుద్ధానుడైయ్యారని ఫాదర్ జోసఫ్ తంబి తెలిపారు.



కేసరపల్లి చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఫాదర్ కిశోర్



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఫాదర్ సలివేంద్ర శౌరి

కానూరులో మహోత్సవం

పెనమలూరు: కానూరు కార్మెల్‌మాత పుణ్య క్షేత్రంలో ఆదివారం ఏసు పునరుత్థారన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఫాదర్ సలివేంద్ర శౌరి ఆధ్వర్యంలో 40 రోజుల ఉపవాస దీక్షలు ఆదివారంతో ముగిశాయి. ఏసు పునరుత్థారన మహోత్సవం శనివారం రాత్రి నుంచి ఆదివారం వేకువ జాము వరకు భక్తిశ్రద్ధలతో చేశారు. దివ్య బలి పూజ సమర్పించారు. చెడు జీవితాన్ని వీడి నూతన జీవితాన్ని ప్రారంభించాలని ఫాదర్ సలివేంద్ర శౌరి భక్తులకు సూచించారు. ఈ సందర్భంగా ఏసు పునరుత్థారన మైన విధానాన్ని కళ్లకు కట్టినట్లు చూపారు. ఫాదర్లు మైత్రి దేవదానం, రత్నరాజు భక్తులకు దివ్య ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీటీసీ సిస్టర్స్, ఉపదేశకులు, యూనిట్ లీడర్స్, గంగూరు, పోరంకి, సాలిపేట, కామయ్యతోపు, కానూరు ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు. గాయక బృందం ఆలపించిన భక్తి గీతాలు అందరినీ భక్తి మార్గంలో నడిపించాయి.

గీతా మందిరంలో శాంతి హోమం



అభిభాషణం చేస్తున్న ముక్కపాటి శర్మ

నున్న(విజయవాడరూరల్): నున్నలోని శ్రీ గీతా మందిరంలో మహా సంప్రోక్షణ కుంభాభిషేకంలో భాగంగా రెండో రోజైన ఆదివారం మహాశాంతి యాగం, మహాశాంతి కుంభారాధన కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ మహర్షి సద్గురు మలయాళస్వామి వారి దివ్యాశీస్సులతో యేర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి శ్రీ పరిపూర్ణానందగిరి స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా సంప్రోక్షణ కుంభాభిషేక కార్యక్రమాల్లో కర్మయోగ ఫలం పై చిన కంచి ట్రస్టీ ముక్కపాటి శర్మ భక్తులకు అభిభాషణం చేశారు. అలాగే ఉదయం అర్చకస్వామి రొంపిచర్ల దత్తకుమార్ బృందం విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచన, అగ్నిధాన్యములు, నిత్య హోమం, నవగ్రహముఖ ఆరాధన, నవగ్రహ హోమం, నివేదన, హారతి, మంత్రపుష్పం తదితర పూజలు నిర్వహించారు. లోక కళ్యాణార్థం అగ్నిధ్యానం, మహాశాంతి హోమం, పూర్ణాహుతి, నివేదన, హారతి కార్యక్రమాలు జరిగాయి. మూడు రోజుల కార్యక్రమాల్లో భాగంగా చివరి రోజైన సోమవారం ప్రత్యేక పూజలతో పాటు శ్రీశ్రీనివాస కల్యాణ మహాదాశీర్వచనం నిర్వహించనున్నట్లు గీతా మందిరం భక్త బృందం కమిటీ తెలిపింది.

'అవినీతికి పాల్పడే అధికారుల భరతం పడతా'

గన్నవరం: నియోజకవర్గంలో భూదందాలు పాల్పడే వ్యక్తులు, భూకబ్జాదారులు, అవినీతికి పాల్పడే అధికారుల భరతం పడతానని గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మైనింగ్, భూమాఫియాలు గతంలో ఎక్కువగా జరిగాయని, ఇకపై ఆటలు సాగవని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాల్లో కట్టిన అక్రమాలను కూల్చివేసి స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. అక్రమాలను, అవినీతిని ప్రోత్సహించే అధికారుల సంగతి తేలుస్తానని చెప్పారు. భూఆక్రమణల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బాపులపాడు తహసీల్దార్‌కు ఇప్పటికే వార్నింగ్ ఇచ్చామన్నారు. అయితే సొంత పార్టీలో ఆయనను విభేదిస్తున్న నేతలు, వారికి సహకరిస్తున్న అధికారులను ఉద్దేశిస్తూ ఎమ్మెల్యే ఈ హెచ్చరికలు చేసినట్లుగా తెలుస్తోంది. అంతేకాకుండా ఇటీవల మంత్రి పార్థసారథి పుట్టిన రోజును పురస్కరించుకుని కొంత మంది సీఎం ఫొటోలతో టీడీపీతో సంబంధం లేని వ్యక్తులు గన్నవరం నియోజకవర్గంలో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై కూడా ఎమ్మెల్యే పరోక్షంగా విమర్శలు చేశారు. గత ఎన్నికల ముందు వైఎస్సార్ సీపీని వీడి టీడీపీలో తన వెంట నడిచిన నేతలకు సీఎంతో మాట్లాడి పదవులు ఇచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



1977-78 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

కంకిపాడు: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఉత్సాహంగా సాగింది. మండలంలోని మంతెన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1977–78 విద్యాసంవత్సరంలో పదో తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో సమావేశం నిర్వహించారు. తాము విద్యనభ్యసించిన తరగతి గదులను కలియ తిరిగి స్నేహితులతో ఆత్మీయం, సందడిగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. పాఠశాల, పరిసర గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పూర్వ విద్యార్థులు తీర్మానించారు.

దాతల భాగస్వామ్యంతోనే సమాజ అభ్యున్నతి

కంకిపాడు: సమాజ అభ్యున్నతి దాతల భాగస్వామ్యంతోనే ముడిపడి ఉందని విజయవాడ పీఠాధిపతి తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలోని ఆర్సీఎం చర్చి ప్రాంగణంలో దొప్పల జోజి మాస్టర్ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు రూ.10 లక్షలతో నిర్మింపజేసిన జ్ఞాపకార్థ వేదికను ఆదివారం రాత్రి ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు జరిపించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి తెలగతోటి జోసఫ్ రాజారావు మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. దైవ ఆరాధనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. క్రీస్తు చూపిన సేవా మార్గంలో పయనించాలని ఆకాంక్షించారు. జోజి మాస్టర్ సతీమణి లూర్దు మరియమ్మ, కుటుంబ సభ్యులను బిషప్ రాజారావు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఫాదర్ పోలిమెట్ల క్రీస్తురాజు, సంఘస్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ప్రార్థనలు నిర్వహిస్తున్న విజయవాడ పీఠాధిపతి తెలగతోటి జోసఫ్ రాజారావు

సాహిత్యానికి సామాజిక ప్రయోజనం ఉండాలి



గ్రంథావిష్కరణ సభలో మండలి బుద్ధప్రసాద్, సంగయ్య తదితరులు

విజయవాడకల్చరల్: సాహిత్యానికి సామాజిక ప్రయోజనం ఉండాలని ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. మాధురి ప్రచురణలు ఆధ్వర్యాన సాహితీ మిత్రుల సమక్షంలో ఆదివారం గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో డాక్టర్ లగడపాటి సంగయ్య రచించిన మూడు కావ్యాలు తెలుగు ధీర శతకం, ఆంధ్ర రఘువంశం, పల్లెపట్నం ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కావ్యాలను ఆవిష్కరించిన మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ సాహిత్యానికి సమకాలీనత, సార్వజనీత ఉండాలని అన్నారు. పద్యకావ్యమైన, కవిత్వమైన, శతకమైన సమాజ శ్రేయస్సు కనిపించాలన్నారు. పద్యసాహిత్యంలో రచయిత సంగయ్య కృషిని అభినందించారు. శతావధాని పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ కాళీదాసు మేఘసందేశం గురించి వివరించారు. విశ్రాంత వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గుమ్మా సాంబశివ రావు శత సాహిత్యంపై మాట్లాడారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు, లగడపాటి రమాదేవి పాల్గొన్నారు.

అడ్డగోలుగా మట్టి తవ్వకాలు

- ఆలయ స్థలం అభివృద్ధి పేరుతో తవ్వకాలు
- అడ్డగోలు తవ్వకాలతో గ్రామస్తుల్లో ఆందోళన



నెప్పల్లిలో జరుగుతున్న మట్టి తవ్వకాలు



ఆలయ స్థలంలో జరుగుతున్న మెరక పనులు

కంకిపాడు: నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న మట్టి తవ్వకాలు గ్రామస్తుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. అడ్డగోలుగా తవ్వకాలు చేయటం వల్ల రానున్న రోజుల్లో ప్రమాదాలు సంభవిస్తే బాధ్యులు ఎవరంటూ ప్రశ్నిస్తున్నారు. తవ్వకాలపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళితే...

మండలంలోని నెప్పల్లి గ్రామ పరిధి గుండా మురుగు బోదె(నాన్ నోటిఫైడ్) ఉంది. ఎంతో కాలంగా ఈ బోదె ఎండిపోయి ఉండటంతో గ్రామంలోని శివాలయం వెనుక దేవదాయ శాఖకు చెందిన స్థలంలో కల్యాణ మండపం నిర్మించే క్రమంలో స్థలాన్ని మెరక చేసేందుకు నిర్ణయించారు. దీనికి మురుగు బోదెలో మట్టి తవ్వేందుకు నిర్ణయించారు. పంచాయతీ పాలకవర్గం దేవదాయ శాఖ అధికారులకు సంతకాలతో కూడిన వినతిని ఇచ్చి స్థలం మెరకకు ఉపక్రమించారు. రెండు రోజులుగా మురుగు బోదెలో సుమారు 8 అడుగుల లోతున మట్టిని తవ్వుతున్నారు. రెండు ప్రొక్లెయినర్లతో మట్టిని తవ్వి తరలించేస్తున్నారు. గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

భవిష్యత్తులో ప్రమాదాలు

పొలాల్లో మురుగు వచ్చి బోదెలో చేరితే గేదెలు దిగినా, చిన్నారులు దిగినా ప్రమాదం బారిన పడే అవకాశం ఉందని వాపోతున్నారు. తవ్వటం అంటే ఎలా పడితే అలా తవ్వేస్తారా ? అంటూ ప్రశ్నిస్తున్నారు. దీనిపై కూటమి నేతల్లోనూ విబేధాలు తలెత్తి ఉన్నతాధికారుల వరకూ ఫిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తోంది. తవ్వకాలపై పరిమితి విధిస్తే భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని గ్రామస్తులు సూచిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ వి.భావనారాయణను వివరణ కోరగా బోదె నాన్ నోటిఫైడ్ కావటంతో పంచాయతీ తీర్మానం మేరకు పనులు చేసుకోమని సూచించామన్నారు. నిబంధనలు అతిక్రమించి తవ్వుతుండటం వల్ల ప్రమాదాలకు ఆస్కారం ఉండదా? అని ప్రశ్నిస్తే ఎంతో కాలంగా బోదెలో మురుగు పారుదల అవ్వటం లేదని, అంతటి సమస్య ఉండదని చెప్పారు.

వినయ్ మృతికి సంతాపం

ఉయ్యూరు: గుండెపోటుతో వైఎస్సార్ సీపీ యువ నాయకుడు మృతి చెందిన సంఘటన ఉయ్యూరు పట్టణంలో తీవ్ర విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని సుందరమ్మ పేటకు చెందిన కొండపల్లి వినయ్(29) పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు. శనివారం రాత్రి తీవ్ర గుండెపోటు రావటంతో సహచరులు, స్నేహితులు ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలోనే మృతి చెందాడు. వినయ్ మృతితో ఆ ప్రాంతం అంతా విషాదం అలముకుంది. వినయ్ తండ్రి కొండపల్లి రమేష్ వైఎస్సార్ సీపీ ఉయ్యూరు పట్టణ ప్రధాన కార్యదర్శిగా పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించారు.

కొద్ది నెలల క్రితం గుండెపోటుతో రమేష్ మరణించాడు. కొన్నేళ్ల క్రితం వినయ్ మాతృమూర్తి చనిపోయారు. ఈ క్రమంలో వినయ్ మృతి చెందటంతో కొండపల్లి కుటుంబంలో ఏ ఒక్కరూ మిగల్లేదు. పార్టీ శ్రేణులు, స్నేహితులు, స్థానికులు వినయ్ భౌతికకాయాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి, పార్టీ నేతలు వినయ్ మృతదేహానికి నివాళులర్పించి అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన దాత చంపాలాల్, గిరీష్, వినోద్, ప్రకాష్‌కుమార్ చౌహాన్ సహకారంతో వయో వృద్ధులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ రవికిరణ్ బొబ్బా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వయోవృద్ధులకు నిత్యావసర సరుకుల పంపిణీ, ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేయడం అభినందనీయమని అన్నారు. అనంతరం వయోవృద్ధులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్‌చైర్మన్ తేజ్‌రాజ్‌సోలంకీ, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ మాధవి, ట్రస్టీలు ఎన్వీయూ సతీష్‌కుమార్, తట్టి అర్జునరావు, లక్ష్మీనరసింహరావు, జీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.